సాక్షి నంద్యాల
శనివారం : 27 : సెప్టెంబర్ : 2025



రూ.లక్ష విరాళం

శ్రీశైలంటెంపుల్: గో సంరక్షణనిధి పథకానికి శుక్రవారం విజయవాడకు చెందిన పి.బాలసుబ్రహ్మణ్య శ్రీనివాస్ రూ.1,00,116 విరాళాన్ని అందజేశారు. దాతకు జ్ఞాపికను అందించి సత్కరించారు.



ప్రమాదం పొటుకు పెట్టింది!

పెద్దాసుపత్రిలోని భవనాలకు మరమ్మతులు చేయలేదు. దీంతో వాన నీరు గోడల వెంబడి కారుతూ ఫ్లోరుపైకి చేరుకున్నాయి. రోగులు ఇబ్బంది పడుతున్నారు.

8లో▸



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	:1.633 అడుగులు
ప్రస్తుతం	:1,626.06
టీఎంసీల సామర్థ్యం	:105.788
ప్రస్తుతం	:80.003
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	:14,048
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	:14,303

న్యూస్‌రీల్

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

నంద్యాల: ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు, వంకలు దాటే సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ సునిల్‌షేరాన్ సూచించారు. భారీ వర్షాలతో ఆపదలు, అత్యవసర పరిస్థితులు ఎదురైతే వెంటనే 112కు ప్రజలు కాల్ చేయాలని కోరారు. స్థానిక పోలీసు కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. నంద్యాల జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరిక ఉన్న నేపథ్యంలో జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. పోలీసు హెల్ప్‌లైన్ నంబరుగా ఉన్న డయల్ 100కు బదులు హెల్ప్‌లైన్ నం.112గా ప్రభుత్వం మార్చడమైందన్నారు. గ్రామీణ ప్రజలతో సమావేశాలు ఏర్పాటు చేసి ఉధృతంగా ప్రవహించిన కాల్వలు, నదుల వద్దకు పిల్లలను వెళ్లనివ్వవద్దంటూ సంబంధిత తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమాలు పోలీసులు నిర్వహించాలన్నారు.

పోలీసు స్టేషన్ తనిఖీ

డోన్ టౌన్: పట్టణ పోలీసు స్టేషన్‌ను శుక్రవారంఎస్పీ సునిల్‌షేరాన్ శుక్రవారం తనిఖీ చేశారు. స్టేషన్‌లో పలు రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట డోన్ డీఎస్పీ శ్రీనివాస, సీఐ ఇంతియాజ్‌బాషా, ఎస్ఐ నరేంద్రకుమార్ ఉన్నారు.

ఆత్మకూరు ఎఫ్‌ఆర్‌ఓగా ప్రణీత



ఆత్మకూరురూరల్: ఆత్మకూరు అటవీ డివిజన్ రేంజ్ అధికారిగా ప్రణీత శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఆత్మకూరు ఎఫ్‌ఆర్‌ఓగా ఉన్న పట్టాభి బదిలీ కావడంతో వైఎస్సార్ జిల్లా ఒంటిమిట్ట అటవీ రేంజ్ అధికారిగా ఉన్న ప్రణీత బదిలీపై వచ్చారు. ఆత్మకూరు రేంజ్ పరిధిలో ఉన్న అటవీ ప్రాంతంలో ఇటీవల పెచ్చుపెరిగిపోయిన వన్యప్రాణి వేటగాళ్లను అదుపు చేయడంపై , కృష్ణా తీర ప్రాంతంలో గస్తీ పెంపు వంటి విషయాలపై శ్రద్ధ చూపుతామని ఆమె ఈ సందర్భంగా తెలిపారు.

నేడు దేవరగట్టులో కంకణ ధారణ



ఉత్సవ విగ్రహాలు

హొళగుంద: దసరా ఉత్సవాల్లో భాగంగా దేవరగట్టులో మాళ మల్లేశ్వరస్వామి కంకణ ధారణ కార్యక్రమం శనివారం జరగనుంది. ఉదయం నెరణికి, నెరణికి తండా, కొత్తపేట గ్రామస్తులు నెరణికి గ్రామం నుంచి మాళ మల్లేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలను దేవరగట్టుకు తీసుకెళ్లి అక్కడ ప్రత్యేక పూజలు జరపనున్నారు. అలాగే కొండ పైనున్న మూల విరాట్‌లకు సుప్రభాత సేవ, బండరార్చన, కుంకుమార్చన, అభిషేకాలు, మహా మంగళారతి, అర్చనలతో పాటు ఇతర ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అనంతరం రాత్రి ఆలయంలోని కంకణకట్టపై నెరణికి పురోహితులు రవిశాస్త్రి మాత మాళమ్మ, మల్లేశ్వరునికి కంకణధారణ నిర్వహించి నిశ్చితార్థ కార్యక్రమాన్ని చేపడతారు.అనంతరం మల్లేశ్వర ఉత్సవ విగ్రహాన్ని గట్టు కిందకు తెచ్చి కాడ సిద్ధప్ప మఠంలో ఉంచుతారు. అక్టోబర్ 2న విజయదశమి రోజున కళ్యాణోత్సవం నిర్వహించనున్నారు. ఉత్సవాల్లో భాగంగా 3న దైవవాణి(కార్ణీకం), 4న రథోత్సవం, 5న గొరవయ్యల ఆటలు, గొలుసు తెంపుట, దేవదాసీల క్రీడోత్సవం, 6న మాళమల్లేశ్వర స్వామి విగ్రహాలు నెరణికి గ్రామానికి చేరుకుంటాయి.

చిరుద్యోగుల వేతన వేదన!

- జిల్లాలో 168 మంది కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు
- వేతనాలు అందక, సంక్షేమ పథకాలు వర్తించక అవస్థలు
- ఉద్యోగుల కుటుంబాల్లో ఆకలి కేకలు
- సంక్షేమ పథకాలు వర్తింప చేయాలని డిమాండ్



కోవెలకుంట్ల ఎంఈఓ కార్యాలయం



కోవెలకుంట్ల: సమగ్ర శిక్ష, విద్యాశాఖల్లో పనిచేసే కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ చిరు ఉద్యోగులు వేతనాలు అందక ఇబ్బంది పడుతున్నారు. జిల్లాలోని 29 మండలాల పరిధిలో 168 మంది సీఆర్‌ఎంటీ(క్లస్టర్ రిజర్వు మొబైల్ టీచర్స్)లు, మండల్ లెవల్ అకౌంటెంట్లు, ఎంఐఎస్ కో ఆర్డినేటర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు విధులు నిర్వర్తిస్తున్నారు. వేతనాలు అందక, సంక్షేమ పథకాలు వర్తించక కుటుంబాలను భారంగా నెట్టుకొస్తున్నారు. పెరిగిన నిత్యావసర సరుకుల ధరలు, ఇంటి అద్దెలు, పిల్లల చదువు, వైద్య, ఇతర ఖర్చులతో దిక్కుతోచని పరిస్థితులతో అల్లాడిపోతున్నారు. కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత లేకుండా పనిచేయాల్సి వస్తోందని ఆందోళన చెందుతున్నారు.

కూటమి ప్రభుత్వంలో అందని వేతనాలు

కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సంక్షేమాన్ని కూటమి ప్రభుత్వం పట్టించుకోకపోవడం లేదు. అరకొరగా వస్తున్న వేతనాలు సైతం రెండు నెలల నుంచి అందడం లేదు. వేతనాల పెంపు అటుంచితే కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఆరు నెలల్లోనే కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు షాక్ ఇచ్చింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో నడుస్తున్న పథకాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులకు మినిమమ్ టైం స్కేల్ వర్తింపచేయరాదని ఈ ఏడాది జనవరి నెలలో జీవోనంబర్–2ను విడుదల చేసింది. ప్రభుత్వ శాఖల్లో మంజూరైన ఖాళీపోస్టుల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులు మాత్రమే అర్హులుగా తేల్చింది. ఈ జీఓ రాజ్యాంగం కల్పించిన సమానత్వ హక్కుకు విరుద్ధమని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఆంధ్రప్రదేశ్‌లో కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు సరైన వేతన నిబంధనలు లేకపోవడం బాధాకరమని ఉద్యోగులు వాపోతున్నారు.

వైఎస్సార్‌సీపీ హయాంలో ఇలా..

జిల్లాలోని ఆయా మండలాల్లోని ఎంఈఓ కార్యాలయాల్లో 91 మంది సీఆర్‌ఎంటీఎస్‌లు, 19 మంది మండల్ లెవల్ అకౌంటెంట్లు, 29 మంది ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, 29 మంది డేటా ఎంట్రీ ఆపరేటర్లు పనిచేస్తున్నారు. వీరంతా 2012లో ఉద్యోగాల్లో చేరారు. వీరికి గతంలో నెలకు రూ. 18,500 వేతనం అందేది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 2020వ సంవత్సరం వేతనాన్ని రూ. 23,500లకు పెంచింది. అప్పటి నుంచి వీరికి ఈ వేతనం అందుతోంది.

తప్పుని వెట్టి చాకిరి

కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ పద్ధతని పనిచేస్తున్న సీఆర్‌ఎంటీఎస్‌లతో ప్రభుత్వం వెట్టిచాకిరి చేయిస్తోంది. ఈ ఏడాది జూన్‌నెలలో పాఠశాలలు పునఃప్రారంభం కాగా ఉపాధ్యాయుల బదిలీలు, డీఎస్సీ పరీక్షల నిర్వహణ అదే నెలలో ఉండటంతో పనిభారం సీఆర్‌ఎంటీఎస్‌లపై పడింది. జిల్లాలో ఉన్న ఏకోపాధ్యాయ పాఠశాలల్లో వీరు ఉపాధ్యాయులుగా విధులు నిర్వర్తించాల్సి వచ్చింది. సీఆర్‌ఎంటీఎస్‌లను డిప్యూటేషన్లపై ఇతర పనులు అప్పగించమని ప్రకటించినా ఆచరణలో అమలు కాలేదు. ఏకారణంతోనైనా ఏకోపాధ్యాయ పాఠశాలల్లో ఉపాధ్యాయుడు విధులకు హాజరు కాకపోతే ఆ స్థానాల్లో సీఆర్‌ఎంటీఎస్‌లు వెళ్లి విద్యార్థులకు విద్యాబోధన చేస్తున్నారు.

అమలు కాని హామీలు

కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు సంక్షేమ పథకాలు వర్తింప చేస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో టీడీపీ చేర్చింది. అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ దిశగా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఎన్టీఆర్ భరోసా పింఛన్లు, తల్లికి వందనం, నూతన రేషన్ కార్డులు, తదితర సంక్షేమ పథకాలు వర్తింప చేసినా కొందరికి మాత్రమే షరతులు విధించారు. నిత్యావసర ధరలు, రవాణా ఖర్చులు, వైద్య ఖర్చులు, ఇంటి అద్దెలు విపరీతంగా పెరిగడంతో అప్పులు చేయాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఇవీ డిమాండ్లు..

- ఆరోగ్య భద్రత, పిల్లల విద్య, ఇంటి అద్దె భృతి, రేషన్ సబ్సిడీ పథకాలను ప్రత్యేకంగా అమలు చేయాలి.
- రద్దు చేసిన ఒంటరి మహిళ పెన్షన్, కుటుంబ సభ్యుల వృద్ధాప్య పింఛన్లు పునరుద్ధరించాలి.
- అంగన్‌వాడీ, ఆశావర్కర్లకు గ్రాట్యూటీ అమలు చేస్తూ రిటైర్డ్‌మెంట్ వయస్సును 62 ఏళ్లకు పెంచారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఇదే విధానాన్ని అమలు చేయాలి.



విశేష పూజలు

- శేష వాహనంపై కనిపించిన ఆదిదంపతులు
- స్వామిఅమ్మవార్లను దర్శించుకుని పులకించిన భక్తజనం

శ్రీశైలంటెంపుల్: దసరా మహోత్సవాల్లో భాగంగా ఐదో రోజు శుక్రవారం భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామిఅమ్మవార్లు శేష వాహనంపై కనిపించి భక్తులకు ఆశీస్సులు అందించారు. శేషవాహనంపై ప్రత్యేకంగా అలంకరించిన స్వామిఅమ్మవార్ల ఉత్సవ మూర్తులకు అలంకార మండపంలో అర్చకులు, వేద పండితులు ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. స్కందమాత స్వరూపంలోని అమ్మవారిని, శేషవాహనంపై అధిష్ఠించిన స్వామిఅమ్మవార్లను కన్నులారా భక్తులు దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించుకుని నీరాజనాలు సమర్పించారు. ఈ పూజా కార్యక్రమంలో దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు దంపతులు, ఇతర విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. వర్షం కారణంగా స్వామిఅమ్మవార్లకు నిర్వహించాల్సిన గ్రామోత్సవం రద్దయింది.

శ్రీశైలంలో నేడు..

దసరా నవరాత్రోత్సవాల్లో భాగంగా ఆరో రోజు శనివారం శ్రీశైల క్షేత్రంలో కాత్యాయని అలంకారంలో అమ్మవారు, హంస వాహన సేవపై స్వామిఅమ్మవార్లు భక్తులకు దర్శనమివ్వనున్నారు.

స్కందమాత అలంకారంలో శ్రీశైల భ్రామరీ

నవదుర్గాలలో ఐదో రూపమైన స్కందమాత దేవి చతుర్భుజాలను కలిగి ఉంటారు. ఒక చేతిలో స్కందున్ని పట్టుకుని ఉండి, మిగిలిన చేతుల్లో పద్మాలను, అభయముద్రలను ధరించి ఉంటారు. ఈమె ఒడిలో బాలుని రూపంలో స్కందుడు(కుమారస్వామి) కూర్చొని ఉంటారు. స్కందదేవుని జనని కావడంతో ఈ దుర్గాస్వరూపం స్కందమాతగా ప్రసిద్ధి చెందారు. స్కందమాతను ఆరాధిస్తే సకల కోర్కెలు నెరవేరడంతో పాటు శాంతి సౌఖ్యాలు లభిస్తాయని భక్తుల నమ్మకం. దసరా నవరాత్రోత్సవాలల్లో భాగంగా ఐదో రోజు శుక్రవారం శ్రీశైల భ్రమరాంబాదేవి స్కందమాత స్వరూపంలో ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారి ఉత్సవమూర్తిని ఆలయం ఎదుట ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై కొలువుంచారు. అనంతరం ఆలయ అర్చకులు, వేదపండితులు వేదమంత్రోచ్ఛారణల నడుమ ప్రత్యేక పూజా హారతులనిచ్చారు.



బాలికల నృత్య ప్రదర్శన



కత్తులతో కళాకారుల విన్యాసం

పల్లెలు, పట్టణాల్లో ఆరోగ్య ప్రచారం

- జిల్లా కలెక్టర్ రాజకుమారి



ఆరోగ్య ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్

నంద్యాల: సమగ్ర ఆరోగ్య ప్రచార రథాన్ని శుక్రవారం కలెక్టరేట్ ఆవరణలో జిల్లా కలెక్టర్ రాజకుమారి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామాల్లో, పట్టణాల్లో ఆరోగ్యంపై రథం ద్వారా విస్తృతంగా ప్రచారం చేస్తారని పేర్కొన్నారు. ప్రజల్లో అవగాహన కల్పించడం ద్వారానే అన్ని రకాల ఆరోగ్య సమస్యల్లో 50 శాతం మేర పరిష్కారం సాధ్యమవుతుందన్నారు. ఎయిడ్స్‌తో పాటు ఇతర ఆరోగ్య సమస్యలను కూడా ప్రజలు తేలికగా ఎదుర్కొనగలిగే విధంగా వైద్య సిబ్బంది నిరంతరం కృషి చేయాలన్నారు. సమయానికి సరైన మందులు వాడితే వ్యాధులను పూర్తిగా నియంత్రణలో ఉంచవచ్చన్నారు. సమగ్ర ప్రచార రథంలో అమర్చిన ఎల్‌ఈడీ స్క్రీన్ ద్వారా ఆరోగ్య అంశాలపై ప్రజలకు ప్రత్యక్షంగా అవగాహన కల్పించాలన్నారు. జిల్లా లెప్రసీ, ఎయిడ్స్ – క్షయ వ్యాధి అధికారి డాక్టర్ శారదా బాయి మాట్లాడుతూ.. రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సమితి మార్గదర్శకత్వంలో ఏపీ సాక్స్ ఆధ్వర్యంలో 15 రోజుల పాటు నంద్యాల జిల్లాలో స్వచ్ఛంద సంస్థల సహకారంతో ఈ ప్రచార కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డీఎంహెచ్‌ఓ డాక్టర్ వెంకటరమణ, వైద్య అధికారులు డాక్టర్ కాంతారావు నాయక్, డాక్టర్ అవినాష్ రెడ్డి, డాక్టర్ తేజస్విని, డాక్టర్ నౌషీన్, ఏపీ సాక్స్ ప్రోగ్రామ్ గణాంక అధికారి దేవిశంకర్ గౌడ్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు నాగరాజు, వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలం, విజయవాడ వెళ్లే వాహనాల దారి మళ్లింపు

- సిద్ధాపురం అలుగు వద్ద పోలీసుల బందోబస్తు




సిద్ధాపురం అలుగు వద్ద పోలీసుల బందోబస్తు

ఆత్మకూరు: భారీ వర్షంతో వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో ఆత్మకూరు మీదుగా శ్రీశైలం, విజయవాడ, విశాఖపట్నం, గుంటూరు, ఒంగోలు, చీరాల తదితర ప్రాంతాలకు వెళ్లే వాహనాలను దారి మళ్లించారు. నల్లమలలోని రాళ్లవాగు ఉధృతితో సిద్ధాపురం చెరువుకు వరదనీరు పోటెత్తింది. ఫలితంగా సిద్ధాపురం చెరువు నిండి అలుగు దాటి ప్రమాద సూచికతో ప్రవాహం కొనసాగుతోంది. దీంతో ఆత్మకూరు పోలీసులు అప్రమత్తమై గురువారం రాత్రి వాహనాల రాకపోకలను నిలిపివేశారు. నల్లమల నుంచి కర్నూలు–గుంటూరు జాతీయ రహదారి మీదుగా దోర్నాల వద్దే వాహనాలను నిలిపివేసినట్లు సీఐ రాము తెలిపారు. ఈ వాహనాలను దోర్నాల నుంచి మార్కాపురం, గిద్దలూరు మీదుగా నంద్యాల, ఆత్మకూరు, కర్నూలుకు చేరాలని ఆదేశాలు జారీ చేశారు. అలాగే బెంగళూరు, కర్నూలు మీదుగా వచ్చే వాహనాలను ఆత్మకూరు పట్టణంలోని నంద్యాల టర్నింగ్ వద్ద నంద్యాల, గిద్దలూరు, దోర్నాల మీదుగా శ్రీశైలం, విజయవాడకు వెళ్లేలా చర్యలు తీసుకున్నారు. ఇప్పటికే వరద అధికంగా అలుగు వద్ద ఉండడంతో దోర్నాల పోలీసులతో ఆత్మకూరు పోలీసులు మాట్లాడి వాహనాల రాకపోకలకు దారి మళ్లించారు. వరదరాజస్వామి ప్రాజెక్టుకు భారీ వరదనీరు చేరడంతో రాత్రి 9 గంటల సమయంలో హుటాహుటిన మొదటి గేటు ఎత్తి 1000 నుంచి 1500 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. దీంతో కురుకుంద, కొత్తపల్లి, ఆత్మకూరు వద్ద ఉన్న భవనాశి నది, సుద్దవాగులు పొంగి ప్రవహించాయి. దీంతో రాకపోకలు నిలిపివేశారు. కురుకుంద, కొత్తపల్లి మండలాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వాగును ఎట్టి పరిస్థితుల్లో దాటొద్దని సీఐ సూచించారు. రెండుచోట్ల పోలీసులు బందోబస్తు నిర్వహించినట్లు తెలిపారు. భారీ వర్షాలు కురవడంతో ఆత్మకూరు, కొత్తపల్లి మండలాలకు రాకపోకలు నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

పగిడ్యాల మండలంలో అత్యధిక వర్షం

నంద్యాల(అర్బన్): జిల్లాలో గురువారం సాయంత్రం నుంచి శుక్రవారం ఉదయం వరకు భారీ వర్షం కురిసింది. పగిడ్యాల మండలంలో అత్యధికంగా 36.4 మి.మీ వర్ష పాతం నమోదైంది. జూపాడుబంగ్లా, కొత్తపల్లిలో 26.8, శ్రీశైలంలో 23.4, నందికొట్కూరు, ఆత్మకూరులలో 18.4, పాములపాడులో 11.0, మిడుతూరులో 10.4 మి.మీ వర్షం కురిసినట్లు అధికారులు తెలిపారు.

కేఎంసీ మైక్రోబయాలజీకి ఎన్‌ఏబీఎల్ గుర్తింపు



వైద్యులను అభినందిస్తున్న కేఎంసీ ప్రిన్సిపాల్

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు మెడికల్ కాలేజీ(కేఎంసీ)లోని మైక్రోబయాలజీ విభాగానికి ప్రతిష్టాత్మకమైన ఎన్‌ఏబీఎల్ గుర్తింపు లభించింది. ఈ మేరకు మైక్రోబయాలజీ విభాగం వైద్యులను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ శుక్రవారం అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మైక్రోబయాలజీ విభాగంలోని హెచ్ఐవీ పరీక్షలకు ఎన్ఏబీఎల్ నూతన నిబంధనల ప్రకారం గుర్తింపు లభించిందన్నారు. అత్యంత కచ్చితత్వంతో పరీక్షలు నిర్వహించే వారికే ఈ గుర్తింపు లభిస్తుందన్నారు. మైక్రోబయాలజీ హెచ్ఓడీ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రేణుకాదేవి మాట్లాడుతూ ప్రిన్సిపాల్ సహకారంతో సూపర్‌స్పెషాలిటీ డీఎం వైరాలజీ సీట్లకు ప్రతిపాదనలు పంపుతున్నట్లు తెలిపారు.

డిగ్రీ రెండో విడత ప్రవేశాలకు షెడ్యూల్ విడుదల

కర్నూలు కల్చరల్: రాష్ట్రంలోని డిగ్రీ కళాశాలల్లో రెండో విడత ప్రవేశాలకు ఏపీ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ షెడ్యూల్‌ను విడుదల చేసింది. ఈ మేరకు ఓఏఎమ్‌డీసీ –2025 కన్వీనర్ టీవీ కృష్ణమూర్తి ఉత్తర్వులు విడుదల చేశారు. ఓఏఎమ్‌డీసీ విధానంలో ప్రవేశం పొందేందుకు ఈనెల 29వ తేదీ వరకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. అక్టోబర్ 1 వరకు వెబ్‌ఆప్షన్లు, అక్టోబర్ 3వ తేదీన వెబ్‌ఆప్షన్ల మార్పు, 6వ తేదీన సీట్ల కేటాయింపు ఉంటుంది.

ప్రతి ఒక్కరికీ జీఎస్టీ ఫలాలు

- వాణిజ్యపన్నుల శాఖ జాయింట్ కమిషనర్

కర్నూలు(హాస్పిటల్): కేంద్ర ప్రభుత్వం ఈ నెల 22వ తేదీ నుంచి అమలు చేస్తున్న జీఎస్టీ తగ్గింపు ఫలాలను ప్రతి ఒక్కరూ అందుకునేలా చర్యలు తీసుకుంటున్నట్లు వాణిజ్యపన్నుల శాఖ జాయింట్ కమిషనర్ జె.నీరజ చెప్పారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. జీఎస్టీ సంస్కరణలు, సూపర్ జీఎస్టీ–సూపర్ సేవింగ్స్ అనే అవగాహన, ప్రచార కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా నెలరోజుల పాటు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజలకు జీఎస్టీ 2.ఓ లాభాలు తెలుపుతారన్నారు. ఈ నెల 29వ తేదీ వరకు ఇంటింటికీ జీఎస్టీ ఫలాలు, 30 నుంచి అక్టోబర్ 6 వరకు వ్యవసాయం, ఇతర వృత్తులు, 7 నుంచి 13వరకు మానవ వనరుల అభివృద్ధి, డిజిటల్ సాధికారిత, 14 నుంచి 18 వరకు వికాస విశ్వాస్–నమ్మకమైన అభివృద్ధి, 19న నిజమైన దీపావళి అనే కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరించారు.

పెద్దాసుపత్రి నిధులకు 'టెండర్'!

'తినేవాడు మనవాడైతే చాలు పంక్తిలో ఏ మూల కూర్చున్నా ముందుగా వారికే' అన్నట్లు ఉంది కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల అధికారుల తీరు. కోట్ల రూపాయల విలువ జేసే ఆసుపత్రికి అవసరమైన మందులు, సర్జికల్స్ తదితరాల సరఫరా కాంట్రాక్టును తిరిగి పాత వారికే కట్టబెట్టారు. కొత్తవారు దరఖాస్తు చేసినా అర్హత లేదని తిరస్కరించారు. దీంతో అధికారంలో ఉన్న వారికి, అనుకూలమైన వారికే టెండర్ దక్కింది. దీంతో ఆసుపత్రిలో కోట్ల విలువైన నిధులకు 'టెండర్' వేసినట్లయ్యింది.

- అనుకూలమైన వారికి కాంట్రాక్టు దక్కేలా నిబంధనల మార్పు
- మెడికల్, సర్జికల్, రీ–ఏజెన్స్, ఇన్‌ప్లాంట్స్ కేటాయింపులు
- కొత్తవారు దరఖాస్తు చేస్తే అనుభవం లేదంటూ తిరస్కరణ
- టెండర్ల నిర్వహించి రూ.3కోట్ల విలువైన పనుల అప్పగింత!



కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల

కర్నూలు(హాస్పిటల్): రాయలసీమ జిల్లాలకు తలమానికమైన కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు సీమ జిల్లాలతో పాటు తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుంచి సైతం రోగులు చికిత్స నిమిత్తం వస్తుంటారు. ఈ ఆసుపత్రికి ప్రతిరోజూ 2,500 నుంచి 3వేల వరకు ఓపీ రోగులు, 1,200 నుంచి 1,500 వరకు ఇన్‌పేషంట్లు చికిత్స కోసం వస్తుంటారు. ప్రైవేటు ఆసుపత్రుల్లో వైద్యం ఖరీదు కావడం, ఎన్‌టీఆర్ వైద్యసేవ సరిగ్గా అమలు కాకపోవడంతో ఇటీవల కాలంలో పెద్దాసుపత్రికి వచ్చే రోగుల సంఖ్య మరింత పెరిగింది. ఒక్కోసారి ఓపీ రోగుల సంఖ్య 3,500 వరకు చేరుకుంటుండగా మెడికల్ వార్డుల్లో ఒక్కో పడకపై ఇద్దరేసి రోగులు చికిత్స అందుకుంటున్న పరిస్థితి. ఇలాంటి పరిస్థితుల్లో వీరందరికీ మందులు, సర్జికల్స్, ఆపరేషన్లకు ఇన్‌ప్లాంట్స్, వైద్యపరీక్షలకు రీ ఏజెన్స్‌కు ఆసుపత్రి ఖజానా నుంచి భారీగా ఖర్చు అవుతోంది. రాష్ట్ర ప్రభుత్వం మందులు, సర్జికల్స్, రీ ఏజెన్స్, ఇన్‌ప్లాంట్స్‌ను ఏపీ ఎంఎస్ఐడీసీ డ్రగ్ స్టోర్ ద్వారా పంపిణీ చేస్తుంది. అక్కడ లభించని ఔషధాలను రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల అగ్రిమెంట్ చేసుకున్న ప్రధానమంత్రి జన ఔషధి సంస్థ నుంచి తీసుకోవాల్సి ఉంటుంది. ఈ సంస్థ వద్ద కూడా మందులు లేకపోతే టెండర్ ద్వారా కాంట్రాక్టు దక్కించుకున్న వారి నుంచి కొనుగోలు చేయాల్సి ఉంటుంది. వీటికి ఆసుపత్రి అభివృద్ధి నిధులు, ఎన్‌టీఆర్ వైద్యసేవ నిధులను అధికారులు ఖర్చు చేస్తున్నారు. ఈ మేరకు రెండు, మూడేళ్ల గడువుతో టెండర్లు పిలుస్తున్నారు.

నిబంధనలతో ఎసరు

ఆసుపత్రిలో మందులు, సర్జికల్స్, ఇన్‌ప్లాంట్స్, రీ ఏజెన్స్ కొనుగోలు కోసం అధికారులు ప్రతి ఏటా రూ.3కోట్లకు పైగా నిధులు ఖర్చు చేస్తున్నట్లు సమాచారం. ఈ మొత్తాన్ని ఆసుపత్రి అభివృద్ధి సొసైటీతో పాటు, ఎన్‌టీఆర్ వైద్యసేవ నిధులను ఖర్చు చేస్తున్నారు. ఈ మేరకు గత నెలలో టెండర్ పిలిచారు. డిపాజిట్‌ను రూ.3లక్షల నుంచి రూ.5లక్షలకు పెంచారు. సరఫరాదారు స్థానికుడై ఉండాలని, అనుభవం ఉండాలని నిబంధన పెట్టారు. అయినా కూడా నాలుగు కేటగిరీలకు 51 దరఖాస్తులు వచ్చాయి. నిబంధనల పేరుతో అధికారులు 25 మందికి మాత్రమే టెండర్ పాడేందుకు అవకాశం కల్పించారు. వీరిలో 20 మందికి టెండర్ దక్కింది. గతంలో స్థానికేతరులు సైతం మందులు సరఫరా చేశారు. వారు స్థానికంగా ఉన్న వ్యక్తులతో ఒప్పందం చేసుకుని రోగులకు మందులు అందేలా చర్యలు తీసుకున్నారు. ఈసారి స్థానికేతరులను పక్కనబెట్టారు. దీంతో ఈ టెండర్ విషయమై కొందరు కోర్టును ఆశ్రయించారు. అయినా కూడా అధికారులు టెండర్ నిర్వహించి స్థానికులకు కట్టబెట్టారు.

పక్కాగా ప్రణాళిక వేసి..

సాధారణంగా టెండర్‌లో ఎక్కువ మంది పాల్గొంటే పోటీతత్వం కారణంగా ధర తగ్గుతుంది. కొద్ది మందిని, అది కూడా స్థానికులను మాత్రమే టెండర్‌లో పాల్గొనేలా చేస్తే వారు చెప్పిన ధరకే కొనుగోలు చేయాల్సి వస్తుంది. మందులు, సర్జికల్స్, ఇన్‌ప్లాంట్స్, రీ ఏజెన్స్ ఒక్కో కంపెనీ ఒక్కో ధర, నాణ్యతలో తేడాలూ ఉంటాయి. ఉదాహరణకు పారాసిటమాల్ అనే మందును 10 మాత్రల స్ట్రిప్‌ను ఒక కంపెనీ రూ.10లకు ఇస్తుండగా మరో కంపెనీ రూ.6లకు, ఇంకో కంపెనీ రూ.2లకు ఇస్తాయి. కొందరు బ్రాండెడ్ కాకుండా ప్రాపగండ డిస్ట్రిబ్యూషన్ కంపెనీల మందులను అతి తక్కువగా కొని ఇలాంటి టెండర్ పాడి సరఫరా చేస్తుంటారు. సర్జికల్స్, ఇన్‌ప్లాంట్స్, ల్యాబ్ రీ ఏజెన్స్ సైతం కొన్ని తక్కువగా మార్కెట్‌లో లభిస్తాయి. ఈ విషయాలపై పూర్తిగా అవగాహన ఉన్న అధికారులకే ఇలాంటి టెండర్‌లను నిర్వహించే సామర్థ్యం ఉంటుంది. ఈ విషయాలన్నీ అవపోసన పట్టిన కొందరు అధికారులు, ఉద్యోగులు తమ వారికి టెండర్‌ను కట్టబెట్టేందుకు పక్కాగా ప్రణాళిక వేసి, నిబంధనల పేరుతో ఏ మార్చి మందులు, సర్జికల్స్, ఇన్‌ప్లాంట్స్, రీ ఏజెంట్స్‌లను తమకు అనుకూలురైన వారికి ఒక్కో కేటగిరిని ముగ్గురు, నలుగురికి కట్టబెట్టారన్న విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. వీరిలో కొందరు 10 ఏళ్లుగా, మరికొందరు 15 నుంచి 20 ఏళ్లుగా ఆసుపత్రికి సరఫరా చేస్తున్న వారూ ఉండటం గమనార్హం. వీరు ఏటా సరఫరా చేసే వాటి విలువ రూ.3కోట్లకు పైగానే ఉంటుందని సమాచారం. టెండర్ వివరాలను ఆసుపత్రి అధికారులు గోప్యంగా ఉంచుతున్నారు. ఇతరులకు ఎవ్వరికీ వివరాలు తెలియకుండా జాగ్రత్త పడుతున్నారు. దీంతో టెండర్ నిర్వహణపై అనుమానాలు మరింత రెట్టింపవుతున్నాయి.

క్లుప్తంగా

హంద్రీకి నీటి విడుదల



గోనెగండ్ల: గాజులదిన్నె ప్రాజెక్ట్ ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు భారీగా వరద నీరు వచ్చి చేరుతుండటంతో శుక్రవారం హంద్రీనదికి నీటిని విడుదల చేశారు. జీడీపీలో ప్రస్తుతం 4.3 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగువ నుంచి వరద రావడం, ప్రాజెక్ట్ పరిధిలో మోస్తరు వర్షం కురవడంతో శుక్రవారం ఉదయం ప్రాజెక్టు అధికారులు నాలుగో క్రస్ట్ గేటు ఎత్తి 500 క్యూసెక్కుల నీటిని హంద్రీనదిలోకి విడుదల చేశారు. శుక్రవారం 200 క్యూసెక్కుల వరద నీటి ప్రవాహం జీడీపీలోకి కొనసాగుతుంది. ఎల్లెల్సీ నుంచి 90 క్యూసెక్కుల నీరు జీడీపీలోకి వస్తున్నట్లు ఏఈ మహమ్మద్ ఆలీ తెలిపారు. 4 టీఎంసీల నీటిని నిలువ ఉంచే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు జీడీపీ అధికారులు తెలిపారు.

ప్రాజెక్టు కరకట్ట పరిశీలన

గాజులదిన్నె ప్రాజెక్టు కరకట్టను శుక్రవారం సాయంత్రం ఇరిగేషన్ ఎస్ఈ బాలచంద్రారెడ్డి, ఈఈ పాండురంగయ్య పరిశీలించారు. వర్షానికి దెబ్బతిన్న, కోతకు గురైన కరకట్టను వారు తనిఖీ చేశారు. కట్ట చుట్టూ ముళ్ల పొదలు ఉండటంతో స్థానిక అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. ప్రాజెక్ట్ గేట్ల పనితీరు, ఇన్‌ఫ్లో, అవుట్ ఫ్లో వివరాలు, కట్ట పటిష్టతను ఏఈ మహమ్మద్ ఆలీ, ఉగ్ర నరసింహను అడిగి తెలుసుకున్నారు.

పీఎంజే జ్యువెలరీ ఉద్యోగులపై కేసు నమోదు

నంద్యాల: పట్టణంలోని పద్మావతినగర్‌లోని పీఎంజే జ్యువెలరీ షాపులో పని చేసే ముగ్గురు ఉద్యోగులపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ అస్రార్‌బాషా శుక్రవారం తెలిపారు. సీఐ వివరాల మేరకు.. పీఎంజే జ్యువెలరీ షాపులో బంగారు ఆభరణాలు కనిపించడం లేదని, ఆభరణాలకు సంబంధించిన లెక్కల్లో తేడాలు ఉన్నాయని ఆ సంస్థ అసిస్టెంట్ మేనేజర్ రాఘవ్ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు నంద్యాల మేనేజర్ చిద్విలాస్‌రెడ్డి, క్యాషియర్ రమేష్, లహరిపై చీటింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఎన్ని కేజీల బంగారం కనిపించడం లేదో.. క్యాష్ ఎంత అనే వివరాలు ఆ సంస్థ ఆడిట్ తర్వాత వెల్లడయ్యే అవకాశం ఉందన్నారు.



ఇలాంటి బకెట్లు చాలా అవసరం



భయపెడుతున్న పైకప్పు పెచ్చులు..



ఇలా ఉంటే జారి పడరా..



గోడల వెంబడి ఫ్లోర్‌పైకి చేరుతున్న వాన నీరు..

ప్రమాదం పాటుకు పెట్టింది!



ఆసుపత్రిలోనే కుక్క కరిస్తే..

పెద్దాసుపత్రి అధికారుల నిర్లక్ష్యంతో రోగుల అవస్థలు అన్నీ ఇన్నీ కావు. వైద్య సేవల కోసం సుదూర ప్రాంతాల నుంచి వచ్చే రోగులు ఆసుపత్రిలో ఎదురయ్యే కష్టాలతో వణికిపోతున్నారు. పది రోజులుగా ఎడతెరిపి లేని వర్షాలతో పెద్దాసుపత్రిలో ప్రమాదం పాటుకు పెట్టింది. భవనాలు మరమ్మతులకు నోచుకోకపోవడంతో ఫిమేల్ 5, 6 వార్డుల్లో వాన నీరు గోడల వెంబడి కారుతూ ఫ్లోరుపైకి చేరుకోవడంతో బెడ్లపై కూడా ఉండలేని పరిస్థితి ఏర్పడింది. రోగుల సహాయకుల పరిస్థితి మరీ దారుణంగా ఉంది. రోగులకు అవసరమైన మందులు, ఆహారం కోసం బయటకు వెళ్లాంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని అడుగులో అడుగు వేసుకుంటూ వెళ్లాల్సిందే. కాలు జారితే వాళ్లు కూడా అదే ఆసుపత్రిలో చేరాల్సిన పరిస్థితి నెలకొంది. పైకి చూస్తే భయపెట్టే పైకప్పు పెచ్చులు.. వానకు తడిచిన విద్యుత్ స్విచ్ బోర్డులు.. ఓ వైపు దోమలు.. వార్డు లోపల కుక్కలు.. వామ్మో ఇదేమి ఆసుపత్రి అని రోగులు భయపడుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు



వార్డు అంతా ఇంతే..



అడుగు వేస్తే ప్రమాదం.. అయినా తప్పదు..



స్విచ్ ఎలా వేయాలి..

మోక్షదాయినీ... శ్రీ స్కందమాత...!



అలంకార మండపంలో అమ్మవార్లకు సహస్రదీపాలంకరణ సేవ

మహానంది: కమలవాసినీ. శ్వేతవర్ణం కలిగిన శ్రీ స్కందమాత దుర్గను ఉపాసించడం ద్వారా భవసాగరాల నుంచి విముక్తులై మోక్షం పొందుతారని మహానంది ఆలయ వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని తెలిపారు. మహానందిలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో ఐదోరోజైన శుక్రవారం రాత్రి శ్రీ కామేశ్వరీదేవి అమ్మవారు శ్రీ స్కందమాత దుర్గ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక అలంకార మండపంలో సహస్రదీపాలంకరణ, నృత్యార్చన, మహామంగళ హారతులు, కూష్మాండబలి పూజలు నిర్వహించగా స్కందమాతా...నమోస్తుతే అంటూ ప్రణమిల్లారు. కాగా వర్షం కారణంగా గ్రామోత్సవాన్ని రద్దు చేశారు. పూజా కార్యక్రమాల్లో ఆలయ ప్రధాన అర్చకులు మామిళ్లపల్లి అర్జునశర్మ, సూపరింటెండెంట్లు అంబటి శశిధర్‌రెడ్డి, నీలకంఠేశ్వరరాజు, పి.సుబ్బారెడ్డి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ నాగమల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ఈతకు వెళ్తున్నారా? తస్మాత్ జాగ్రత్త!

కర్నూలు: దసరా సెలవుల నేపథ్యంలో యువకులు, విద్యార్థులు ఈతకు వెళ్లడం వల్ల ప్రమాదకర ఘటనలు జరిగే అవకాశమున్నందున జాగ్రత్తలు పాటించాలని ఎస్పీ విక్రాంత్ పాటిల్ సూచించారు. భారీ వర్షాల నేపథ్యంలో జిల్లాలోని గ్రామాలు, పట్టణ శివారులో వాగులు, వంకలు, చెరువులు, కుంటలు, కాల్వలు పూర్తిగా నిండిపోయాయని, తమ పిల్లలు ఎక్కడికి వెళ్తున్నారో తల్లిదండ్రులు గమనించి జాగ్రత్తలు తీసుకోవాలని శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. నదీ తీర ప్రాంతాల ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని, ఎక్కడైనా, ఏవైనా సమస్యలు ఉంటే 112కు డయల్ చేసి సమాచారం అందించాలని జిల్లా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఆపదలు, అత్యవసర పరిస్థితులు, అసాంఘిక కార్యకలాపాలు, ఏ సమస్య అయినా 112కి కాల్ చేసి సమాచారం అందించాలన్నారు.

క్యాన్సర్‌ను ముందుగా గుర్తిస్తే మేలు

కర్నూలు(హాస్పిటల్): క్యాన్సర్ వ్యాధిని ముందుగా గుర్తించి సరైన చికిత్స అందించడం వల్ల కోలుకునే అవకాశం ఉంటుందని రాష్ట్రీయ బాలస్వాస్థ్య కార్యక్రమ సమన్వయకర్త డాక్టర్ మహేశ్వరప్రసాద్ చెప్పారు. శుక్రవారం స్థానిక ముజఫర్‌నగర్ యుపీహెచ్‌సీలో స్వస్త్‌నారీ స శక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పా ల్గొని మాట్లాడారు. బాల్యవివాహాలు, అపరిశుభ్రత,అబార్షన్ తదితర కారణాలతో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ వస్తుందని తెలిపారు. ప్రాథమిక దశలో దీనిని గుర్తించి చికిత్స తీసుకుంటే ముప్పు నుంచి తప్పించుకోవచ్చని చెప్పారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండటం ద్వారా వీటిని నివారించుకోవచ్చన్నారు. ప్రాథమిక దశలో మొహమాటం కారణంగా వైద్యపరీక్షలకు ఆసక్తి చూపకపోతే ఇబ్బంది తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో డీపీ ఎంఎఓ డాక్టర్ ఉమా, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రోహిణి, డీపీఓ విజయరాజు, కన్సల్టెంట్ సుధాకర్, మల్లికార్జున, ప్రాజెక్షనిస్టు ఖలీల్ పాల్గొన్నారు.

ఆర్టీసీ ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు

● ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమల రావు



ప్రయాణికులతో మాట్లాడుతున్న ఎండీ

డోన్ టౌన్: ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు అన్నారు. శుక్రవారం డోన్ డిపోను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బస్టాండ్‌ను పరిశీలిస్తూ పలువురు ప్రయాణికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. బస్టాండ్‌లో తాగునీటి వసతి, మూత్రశాలలు, ఇతర సౌకర్యాలపై ఆరా తీశారు. అనంతరం డిపో పరిసరాలు, గ్యారేజీను తనిఖీ చేశారు. బస్సుల సంఖ్య, సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కార్యాలయంలో పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందితో ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగుల సమస్యలు, పదోన్నతులపై ప్రభుత్వం ఒక నిర్ణయానికి వచ్చిందని, త్వరలో పదోన్నతులు కల్పిస్తామన్నారు. ప్రజల సౌకర్యార్థం, సంస్థ నిర్వాహణ ఖర్చులను తగ్గించి సంస్థ లాభాలు ఆర్జించేలా 110 ఎలక్ట్రికల్ బస్సులను త్వరలో ప్రవేశపెడుతున్నట్లు తెలిపారు. ఆయన వెంట నంద్యాల జిల్లా రీజినల్ మేనేజర్ రజియా సుల్తానా, డోన్ డిపో మేనేజర్ శశిభూషణ్ తదితరులు ఉన్నారు.

చేపల వేటకు వెళ్లి మృత్యువాత..

పాములపాడు: మండల కేంద్రం పాములపాడు సమీపంలోని ఎస్ఆర్ఎంసీ కాల్వలో సరదాగా చేపల వేటకు వెళ్లిన వ్యక్తి ప్రమాదవశాత్తూ మృత్యువాత పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పెద్ద దోర్నాలకు చెందిన బాలయ్య 56 ఎర్ర గూడూరు వద్ద ఎస్ఆర్ఎంసీ కాల్వపై జరుగుతున్న బ్రిడ్జి పనులకు వచ్చాడు. కాగా శుక్రవారం వర్షం కురుస్తుండడంతో పనులు జరగలేదు. దీంతో చిన్న చేపల వల తీసుకొని ఎస్ఆర్ఎంసీ కాల్వ వద్ద చేపలు పడుతూ ప్రమాదవశాత్తు నీటిలో పడిపోయాడు. గమనించిన మత్స్యకారులు వెంటనే అతని కాపాడేందుకు ప్రయత్నించినా అప్పటికే మృతి చెందాడు. విషయం తెలిసిన పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతుడి కుమారుడు శ్రీను ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ రమణ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

కుక్కలదాడిలో జింక మృతి

ఉయ్యాలవాడ: మండలంలోని హరివరం–నర్సిపల్లె గ్రామాల మధ్య ఉన్న కుంట సమీపంలో శుక్రవారం కుక్కలదాడిలో ఓ జింక మృతి చెందింది. రైతులు గుర్తించి అటవీ అధికారులకు సమాచారం అందించారు. ఇటీవల పొలాలపై జింకలు గుంపులుగా దాడి చేసి పంటలను ధ్వంసం చేస్తుచేస్తుండటంతో రైతులు నష్టపోతున్నారు. అటవీ ప్రాంతాన్ని వీడిన జింకలు రైతులు పండించే పంటలు తింటూ ఇక్కడే స్థావరాలను ఏర్పాటు చేసుకున్నాయి. గతంలో జింకలను కుక్కలు వెంబడించినా అవి దొరికేవి కావు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో బురద నేలల్లో జింకలు పరిగెత్తలేక కుక్కలకు ఆహారంగా మారుతున్నాయి. హరివరం సమీపంలో కక్కల దాడిలో మృత్యువాత పడిన జింక గర్భిణి అని తెలుస్తోంది. అటవీ సంరక్షణ అధికారులు వన్యప్రాణుల సంరక్షించాల్సిన అవసరం ఉందని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

వృద్ధ ఖైదీలకు ఉచిత న్యాయ సహాయం



ఖైదీల వివరాలను తెలుసుకుంటున్న జడ్జి లీలా వెంకటశేషాద్రి

నంద్యాల(వ్యవసాయం): 70 ఏళ్లు పైబడిన వృద్ధ ఖైదీలకు ఉచిత న్యాయ సహాయం అందజేస్తానని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి లీలా వెంకట శేషాద్రి తెలిపారు. శుక్రవారం పట్టణంలోని సైబ్‌జైల్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జడ్జి ఖైదీలతో మాట్లాడుతూ.. సబ్‌జైల్‌లో నెలకొన్న సమస్యలు ఉంటే న్యాయవాదుల దృష్టికి తీసుకురావాలన్నారు. అదే విధంగా జైళ్లలోని ఖైదీల సంఖ్య, కేసుల వివరాల గురించి అడిగి తెలుసుకున్నారు. వారి ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట జైలు సూపరింటెండెంట్ గురుప్రసాదరెడ్డి, న్యాయవాది బాలు, లోక్ అదాలత్ సిబ్బంది రామచంద్రారెడ్డి, తదితరులు ఉన్నారు.

ఎల్లెల్సీలో జారి పడి మహిళ మృతి



మృతురాలు యాస్మిన్ (ఫైల్)

ఆదోని అర్బన్: ఇస్వీ గ్రామానికి చెందిన యాస్మిన్ (30) ఎల్లెల్సీ కాలువలో ప్రమాదవశాత్తూ జారి పడి మృత్యువాత పడింది. శుక్రవారం తన సొంతూరు పెద్ద హరివాణంలోని కుటుంబీకులను చూసేందుకు యాస్మిన్ భర్త నబీసాహెబ్‌తో కలసి సొంత ఆటోలో వెళ్లారు. సాయంత్రం తిరిగి వస్తుండగా నబీసాహెబ్ మలవిసర్జనకు ఆటో నిలిపాడు. ఈ క్రమంలో యాస్మిన్ కాలువలో ముఖం కడిగేందుకు వెళ్లి జారి కాలువలో పడిపోయి కేకలు వేసింది. గమనించిన భర్త వెంటనే స్థానికుల సహాయంతో ఒడ్డుకు చేర్చారు. అస్వస్థతకు గురైన ఆమెను ఆదోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం ప్రైవేటు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలోనే మృతి చెందింది. మృతురాలికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.

అప్పుల మాఫీలో లక్ష కోట్ల అవినీతి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న చింతామోహన్

కర్నూలు(సెంట్రల్): ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన 11 ఏళ్ల పాలనలో కార్పొరేట్ దిగ్గజాలకు రూ.14 లక్షల కోట్ల రుణమాఫీ చేశారని, అందులో 10 శాతం వాట దక్కించుకొని లక్ష కోట్ల అవినీతికి పాల్పడ్డారని కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ ఆరోపించారు. అప్పుల రుణమాఫీలో గుజరాత్ మార్వాడీలే ఎక్కువగా ఉన్నారని, వారి పేర్లను ఆర్థికశాఖమంత్రి నిర్మలా సీతారామన్ ఎందుకు వెల్లడించడం లేదని ప్రశ్నించారు. శుక్రవారం కర్నూలుకు వచ్చిన ఆయన ఓ ప్రైవేట్ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కర్నూలు జిల్లాలో ఎస్సీ వర్గాల ప్రజలు కార్పొరేషన్ ద్వారా రూ.60 కోట్ల రుణాలు తీసుకుంటే కట్టాలని నోటీసులు ఇచ్చే ప్రభుత్వాలు.. బడా కార్పొరేట్లకు ఎందుకు రుణమాఫీ చేస్తున్నాయనో చెప్పాలని డిమాండ్ చేశారు. దేశంలో పత్రికా స్వేచ్ఛకు తీవ్ర భంగం కలుగుతోందని, పత్రిక కార్యాలయాలు, విలేకరులపై దాడులు పెరిగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబు పాలన సజావుగా లేదని, ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత, అసమ్మతి ఉందని చింతామోహన్ పేర్కొన్నారు. ఆయన తన సొంత నియోజకవర్గమైన కుప్పానికే ఏమి చేయలేదని, ఇక సొంత జిల్లా ఊసే పట్టించుకోవడం లేదన్నారు. కర్నూలులో ట్రాఫిక్ సమస్య విపరీతంగా పెరిగిపోతున్నా ఏమైనా చర్యలు తీసుకున్నారా అని ప్రశ్నించారు.

పీహెచ్‌సీ డాక్టర్ల శాశ్వత సంఘం ఏర్పాటుకు ఎన్నికలు



ఎన్నికల రిటర్నింగ్ అధికారి డాక్టర్ లలితకు వినతి పత్రం అందజేస్తున్న వైద్యులు

గోస్పాడు: జిల్లా ప్రైమరీ హెల్త్ సెంటర్ డాక్టర్ల శాశ్వత సంఘం ఏర్పాటుకు ఎన్నికలు జరగనున్నట్లు అడహాక్ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ చెన్నకేశవులు తెలిపారు. శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఇప్పటి వరకు అడహాక్ కమిటీ ద్వారా డాక్టర్ల సంఘం నిర్వహణ కొనసాగిందన్నారు. ఇప్పటి నుంచి ప్రైమరీ హెల్త్ సెంటర్ల డాక్టర్ల శాశ్వత సంఘం ఏర్పాటుకు రాష్ట్ర ఏపీపీహెచ్‌ఈడీఏ నుంచి వచ్చిన ఆదేశాలను అనుసరిస్తామనానరు. ఈ మేరకు ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్‌ను నియమించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణకు విన్నవించగా డీసీహెచ్ఎస్ డాక్టర్ లలితను నియమించారన్నారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా నియామకం పొందిన డీసీహెచ్ఎస్ డాక్టర్ లలితను కలిసి ఎన్నికలు సజావుగా జరిగేలా చూడాలని వినతి పత్రం అందజేశారు. ఎన్నికలకు నామినేషన్ల దాఖలు ఈనెల 25న ప్రారంభమైందని, 27వ తేదీ మధ్యాహ్నం 2గంటలకు ముగుస్తుందన్నారు. అదే రోజు నామినేషన్ల పరిశీలన, 28న ఉపసంహరణ, అనంతరం అదే రోజు ఎన్నికల ప్రక్రియ నిర్వహించనున్నట్లు తెలిపారు.

రెండు బస్సులకు రూ. 8.74 లక్షల జరిమానా

డోన్ టౌన్: నిబంధనలు పాటించకుండా తిరుగుతున్న ప్రైవేట్ వాహనాలకు డోన్ ఎంవీఐ క్రాంతికుమార్ గట్టి షాకు ఇస్తున్నారు. దసరా సీజన్‌ను ఆసరాగా తీసుకొని అనుమతుల్లేకుండా రూట్లలో వెళ్తున్న ప్రైవేట్ బస్సులను లక్ష్యంగా చేసుకుని దాడులు చేస్తున్నారు. శుక్రవారం సాయంత్రం కర్నూలు హైవేలో అముకదాడు టోల్‌ప్లాజా సమీపంలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా బెంగళూరు నుంచి హైదరాబాద్ వెళుతున్న హర్యానాకు చెందిన 'నార్దన్ ట్రావెల్స్', బెంగళూరు నుంచి రాయపూర్‌కు వెళుతున్న 'నవీన్ ట్రావెల్స్' బస్సులపై ఏపీకి చెల్లించాల్సిన టాక్స్ చెల్లించకపోవడంతో రూ. 8,74,600 జరిమానా విధించారు. ఈ తనిఖీల్లో నంద్యాల అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ నాగేంద్రరావు పాల్గొన్నారు.

ఆలూరు-పెద్దహోతూరు రోడ్డులో ఏర్పడిన పెద్ద పెద్ద గుంతలు



10 కి.మీ 500 గుంతలు

నియోజకవర్గ కేంద్రమైన ఆలూరు నుంచి పెద్దహోతూరు రహదారిపై ప్రయాణం అంటే ప్రయాణికులు జడుసుకుంటున్నారు. పది కిలో మీటర్లు ఉండే ఈ రోడ్డులో అడుగడుగునా మోకాలు లోతు గుంతలు ఉన్నాయి. చిన్న.. పెద్ద గుంతలు కలిపి దాదాపు 500కు పైగా ఉన్నాయి. వానలకు ఆ గుంతల్లో నీరు నిలవడంతో వాహనాలు వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. ఇటీవల జిల్లా ఉన్నతాధికారులు ఈ రోడ్డుపై ప్రయాణించినా ఇప్పటి వరకు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో గమనార్హం. ఈ రోడ్డు బాగుపడేదెన్నడూ.. అంటూ ప్రయాణికులు గుంతల దారిలో ప్రయాణిస్తున్నారు.

– ఆలూరు

